సాక్షి ఒడిశా

ఆదివారం । 24 । ఆగస్టు । 2025

గ్రామదేవతకు శ్రావణ సారె సమర్పణ





రాయగడ: పట్టణ ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న స్థానిక భైరవీధిలోని గ్రామదేవత బురుదల పోలమ్మ అమ్మవారికి శ్రావణమాసం సారె సమర్పించారు. శనివారం నాడు ఈ మేరకు మజ్జివీధి, ఎద్దువీధి, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు స్వయంగా రూపొందించిన పిండి వంటలతో పాటు గాజులు, పసుపు, కుంకుమ, పూలు అమ్మవారికి సమర్పించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పంటలు సంవృద్ధిగా పండాలని కోరుతూ అమ్మవారికి మొక్కుబుడులు తీర్చుకున్నారు. అనంతరం స్థానిక మజ్జిగౌరి మందిరానికి వెళ్లిన మహిళలు అమ్మవారికి సారెను సమర్పించారు.



శ్రీ మందిరం ఆదాయం

నగదు : రూ. 4,85,879

వెండి : 37 గ్రాముల 350 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

న్యూస్‌రీల్

పోలీస్ వాహనం బోల్తా



ప్రమాదానికి గురైన పోలీస్ వాహనం

కొరాపుట్: పోలీస్ వాహనం అదుపుతప్పి గోతిలోకి బోల్తా కొట్టింది. ఈ సంఘటన శనివారం వేకువజామున కొరాపుట్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు పోలీసు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీస్ శాఖ ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు. స్థానికులు ఉదయం సంఘటనా స్థలం వద్దకు చేరుకోవడం విషయం వెలుగులోనికి వచ్చింది.

కొడింగాలో పెద్ద పులి కలకలం



కొడెంగా వద్ద రోడ్డు దాటుతున్న పెద్ద పులి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కొడింగాలో పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. కొద్ది రోజులుగా పులి గర్జనలు వినిపిస్తున్నాయని గిరిజనులు పేర్కొన్నారు. ఈ పులి రోడ్డు దాటుతున్న చిత్రాలు వెలుగులోకి రావడంతో వాదనకు బలం చేకూరింది. నబరంగ్‌పూర్ జిల్లా డీఎఫ్ఓ సుబేందు ప్రసాద్ బెహరా మీడియాతో మాట్లాడారు. గత రెండు రోజులుగా కొడింగా అటవీ ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఆ ప్రాంత గిరిజన గ్రామాలలో అప్రమత్తంగా ఉండాలంటూ తాము ప్రకటనలు చేశామన్నారు. కానీ ఇంత వరకు పులి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. కొడింగా రేంజర్ పుర్ణ చంద్ర నందో మీడియాతో మాట్లాడుతూ పులిని చూసినట్లు కొందరు గిరిజనులు పేర్కొన్నారన్నారు. కానీ తమకు పులి పాద ముద్రలు లభ్యం కాలేదన్నారు.

విద్యుదాఘాతంతో యువకుని మృతి



మణిషరావు మండంగి (ఫైల్)

రాయగడ: విద్యుదాఘాంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన జిల్లాలోని కొలనార సమితి సూరి పంచాయతీలోని పొంగోలి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడుని మణిషరావు మండంగి (27)గా గుర్తించారు. మండంగి తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్ తీగ తెగిపోవడంతో దానిని సరిచేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో విద్యుత్ ఘాతానికి గురై కింద పడిపోయాడు. వెంటనే కుటుంబీకులు కొలనార ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరిశీలించిన వైద్యులు అతడు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈమేరకు చందిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

పూరీ సముద్రంలో హైదరాబాద్ యువకుడు గల్లంతు

భువనేశ్వర్: పూరీ సముద్రంలో స్నానం చేస్తుండగా పర్యాటకుడు అదృశ్యమయ్యాడు. గల్లంతైన పర్యాటకుడు హైదరాబాద్‌కు చెందిన 25 ఏళ్ల వికాస్ చందేగా గుర్తించారు. 9వ నంబరు సెక్టార్ సాగర తీరంలో శనివారం ఈ సంఘటన జరిగింది. లైఫ్‌గార్డ్‌లు, అగ్ని మాపక సిబ్బంది యువకుని కోసం సముద్రంలో గాలిస్తున్నారు.

బాలలకు అంతరిక్షంపై అవగాహన



అంతరిక్ష దినోత్సవంలో ఎంపీ సప్తగిరి ఉల్కా తదితరులు

కొరాపుట్: బాలలకు అంతరిక్షంపై అవగాహన పెంచాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా పేర్కొన్నారు. శనివారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని లండిగుడ జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన అంతరిక్ష దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. బాల్యం నుంచే అంతరిక్ష విషయాలపై అవగాహన పెంచాల్సి ఉందన్నారు. ప్రాథమిక విద్య ద్వారా ఇది సాధ్యమని ఎంపీ సప్తగిరి ఉల్కా పేర్కొన్నారు.

నవీన్‌కు మోహన్ పరామర్శ



నవీన్ పట్నాయక్‌తో ముఖ్యమంత్రి సంభాషణ



నవీన్ పట్నాయక్‌ను కలిసిన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి విపక్ష నేత నవీన్ పట్నాయక్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం నవీన్ నివాస్ సందర్శించారు. దాదాపు 10 నిమిషాల పాటు నవీన్ పట్నాయక్‌తో సంభాషించి బాగోగులు తెలుసుకున్నారు. దీర్ఘాయుష్షుతో కూడిన ఆరోగ్యకరమైన జీవితం ప్రసాదించాలని శ్రీ జగన్నాథుడిని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. నవీన్ పట్నాయక్ ముంబైలో చికిత్స పొందుతున్నప్పుడు న్యూ ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నవీన్ ఆరోగ్యం కోసం అడిగినట్లు మోహన్ చరణ్ మాఝి తెలియజేశారు. కుశల ప్రశ్నలు ముగియడంతో త్వరలో ప్రారంభం కానున్న శాసన సభ వర్షా కాలం సమావేశం సజావుగా సాగడానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సహకారాన్ని కోరడం విశేషం. ప్రతిపక్ష నాయకుని ఆరోగ్యం, బాగోగులు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా సందర్శించడం ఉన్నత ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబిస్తుంది. రాజకీయ భేదాభిప్రాయాలకు అతీతంగా ముఖ్యమంత్రి పరామర్శ సందర్శన వర్తమాన రాజకీయ వర్గాలకు బలమైన నైతిక సందేశాన్ని అందజేస్తుంది. ప్రజాస్వామ్య మైత్రి విలువల పరిరక్షణలో రాష్ట్రం మరోసారి తళుక్కుమంది. జాతీయ స్థాయిలో గౌరవాత్మక వ్యక్తిగా వెలుగొందుతున్న మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అఖిల భారత కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు ప్రత్యక్షంగా, ఫోన్ ద్వారా సంభాషించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారందరి ఆకాంక్ష ఫలప్రదమై చక్కని ఆరోగ్యంతో నవీన్ నివాస్‌కు తిరిగి వచ్చిన విపక్ష నేత అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపి ఆయన ఉన్నత వ్యక్తిత్వంతో అందర్ని మరోసారి ఆకట్టుకున్నారు.

దేశ ఆర్థిక పురోగతిలో ఒడిశా ప్రధాన చోదక శక్తి: ముఖ్యమంత్రి



భారత్ నేత్ర ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి భువనేశ్వర్‌లో ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఫైనాన్షియల్ టెక్నాలజీ కెపాబిలిటీ హబ్ (ఐ–జీఎఫ్‌టీసీహెచ్) మరియు భారత్ నేత్ర ప్రారంభించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం, సింగపూర్‌లోని గ్లోబల్ ఫైనాన్స్ అండ్ టెక్నాలజీ నెట్‌వర్క్ (జీఎఫ్‌టీఎన్) మధ్య ఒక మైలు రాయి భాగస్వామ్యంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 500 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో భారత దేశం ప్రపంచ అగ్ర స్థాయి ఆర్థిక సుసంపన్న దేశంగా ఎదిగేందుకు ఒడిశా బలమైన భాగస్వామిగా నిలుస్తుందన్నారు. తలసరి ఆదాయంలో తొలి 5 రాష్ట్రాలలో ఒడిశా ఒకటిగా నిలిచేందుకు నిరవధికంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఒడిశా రాష్ట్రావతరణ శత వార్షికం 2036 నాటికి ఈ లక్ష్యం ఛేదిస్తామని ముఖ్యమంత్రి గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. ఆసియా, పసిఫిక్ ఇన్నోవేషన్ కారిడార్‌తో భారతదేశాన్ని అనుసంధానించడానికి అతి త్వరలో ఈ కేంద్రం ఫిన్‌టెక్, డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత అధునాతన పరిశోధన, సాంకేతిక పర్యావరణ వ్యవస్థలో ఒడిశా తూర్పు పరిశోధన రాజధానిగా వెలుగొందుతుందన్నారు.

ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించుకుని స్టార్టప్‌ల పెంపుదల కోసం అంకితమైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ – గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) త్వరలో ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ఒడిశాను కీలక చోదకంగా మారుస్తుందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల్లో 7,000 పైబడి యువతకు ఫిన్‌టెక్, ఇన్సుర్‌టెక్, బ్లాక్‌చెయిన్, ఏఐ–ఇన్–ఫైనాన్స్ రంగాల్లో నైపుణ్యత శిక్షణ కల్పిస్తారు. ఈ శిక్షణ కోసం ఇప్పటి వరకు 3,800 పైబడి దరఖాస్తులు దాఖలయ్యాయి. వారిలో తొలి విడత కింద 375 మంది అభ్యర్థుల్ని ఎంపిక చేస్తారు. వీరంతా వచ్చే ఏడాది జనవరి నాటికి ఆయా రంగాల్లో పట్టభద్రులుగా నిలుస్తారు. కార్యక్రమంలో కేంద్ర విద్యా విభాగం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాల్గొన్నారు.

శ్రీ మందిరం ప్రాంగణంలో చనుబాల గృహం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దేవస్థానం నిత్యం వచ్చిపోయే భక్తులు, యాత్రికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నిత్యం పెద్ద సంఖ్యలో చాలా మంది తల్లులు పసి బిడ్డలతో కలిసి స్వామి దర్శనం కోసం శ్రీ మందిరానికి విచ్చేస్తుంటారు. ఈ సందర్భంగా బిడ్డలకు పాలు పెట్టేందుకు అనుకూలమైన సౌకర్యం లేక సతమతం అవుతున్న పరిస్థితుల నివారణకు ఆలయ పాలక వర్గం చనుబాల గృహం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి ఇతర అధికారులతో ఈ విషయంపై చర్చించి ప్రత్యేక గృహాన్ని ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం ఖరారు చేశారు. ప్రధాన దేవస్థానం ప్రాంగణంలో పరిపాలన శాఖ కార్యాలయం సమీపంలో చనుబాల గృహం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సంబంధిత గృహం గోప్యత, పరిశుభ్రత, మాతాశిశువుల సౌకర్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ గృహం నిర్వహణ కోసం ప్రత్యేక మహిళా సహాయకురాలిని నియమిస్తారు. ఈ మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులకు సీఏఓ ఆదేశించారు.

రైల్వే అర్బన్ బ్యాంక్ వాటాదారులకు లాభం పంపిణీ

భువనేశ్వర్: అవిభాజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార బ్యాంకు (అర్బన్ బ్యాంకు) వాటాదారులకు త్వరలో లాభం పంపిణీ అవుతుందని తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు తెలిపారు. టాటాలో జరిగిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. దీని వల్ల సమగ్రంగా 1,40,000 మంది వాటాదారులు ప్రయోజనం పొందుతారు. ఖుర్దారోడ్ రైల్వే అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నిరంజన్ మిశ్రా, జగ్మోహన్ ఖుంటియా, శాఖా కార్యదర్శి లక్ష్మీధర మహంతి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ అర్బన్ బ్యాంక్ వాటాదారులకు 2015 సంవత్సరం నుంచి లాభం పంపిణీ నిలిపి వేశారు. గత యాజమాన్యం అవకతవకలతో ఈ అంతరాయం ఏర్పడింది. పాలక మండలి తాజా నిర్ణయంతో స్థానిక అర్బన్ బ్యాంకు వాటాదారుల దీర్ఘకాల కోరిక నెరవేరుతుంది. నాలుగు సంవత్సరాల మిగులు డివిడెండ్‌ను 7.5 శాతం లెక్కన చెల్లించాలని నిర్ణయించారు. ఈ లెక్క లాభం మొత్తం సెప్టెంబర్ 1న వాటాదారుల ఖాతాలకు ప్రత్యక్షంగా బదిలీ చేస్తారు. తక్షణమే లాభం మొత్తం పొందాలనుకున్న వారికి ప్రత్యేక ఏర్పాటు అందుబాటులో ఉందన్నారు.

త్వరలో ఆన్‌లైన్ సేవలు

జాతీయ బ్యాంకుల తరహాలో రైల్వే అర్బన్ బ్యాంకు వాటాదారుల సౌకర్యం కోసం ఆన్‌లైన్ సేవల్ని ప్రవేశపెడుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 13న ఈ సేవల్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీఎంటీడీ ఖాతాలో పొదుపు, రుణ దరఖాస్తు, మంజూరు, హాలిడే హోమ్ బుకింగ్ వంటి వివిధ సౌకర్యాలను ఉన్న చోటు నుంచే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షంగా పొందేందుకు వీలవుతుందన్నారు. ఈ మేరకు అనుబంధ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముందస్తుగా ముగించుకోవాలని అభ్యర్థించారు.

సెప్టెంబర్ 10న వయో వృద్ధుల తీర్థయాత్ర



అదనపు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వయో వృద్ధుల తీర్థయాత్ర సన్నాహక సమావేశం

- 6 జిల్లాల నుంచి 775 మంది యాత్రికులకు ఏర్పాట్లు

భువనేశ్వర్: ఈ ఏడాది వయో వృద్ధుల తీర్థ యాత్ర పథకం కింద అయోధ్య, బనారస్‌లను సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడతలో 6 జిల్లాల నుంచి 775 మంది యాత్రికులకు ఈ సౌలభ్యం కల్పిస్తున్నారు. ఈ యాత్ర భువనేశ్వర్ నుంచి సెప్టెంబర్ 10న ప్రారంభమై 15తో ముగుస్తుంది. వయో వృద్ధుల తీర్థ యాత్ర ఏర్పాట్ల కోసం ఖుర్దా అదనపు జిల్లా కలెక్టర్ ప్రతాప్ చంద్ర బెవురా అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ ఏడాది కటక్, ఖుర్దా, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, ఢెంకనాల్ ప్రాంతాల నుంచి 775 మంది వయో వృద్ధులు బయల్దేరుతారు. దారి పొడవునా వారి సహాయ సహకారాల కోసం 25 మంది అధికారుల్ని నియమిస్తున్నారు. సన్నాహక సమావేశంలో తీర్థయాత్రలో పాల్గొనే వయో వృద్ధుల భద్రత, ఆహారం, ఆరోగ్యం మొదలైన వాటిపై వివరంగా చర్చించారు. సంబంధిత యాత్రికులు సంబంధిత జిల్లాల నుంచి బయల్దేరి సెప్టెంబర్ 9న భువనేశ్వర్ చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భువనేశ్వర్‌లోని వివిధ ప్రభుత్వ సంస్థల్లో వారికి తాత్కాలిక వసతి కల్పిస్తారు. ఈ వసతి గృహంలో వృద్ధుల భద్రత, ఆరోగ్య తనిఖీ, ఆహారం, ఇతర సంబంధిత ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రతాప్ చంద్ర బెవురా అనుబంధ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఖుర్దా అదనపు జిల్లా కలెక్టర్ రుద్ర నారాయణ్ మహంతి, డిప్యూటీ జిల్లా కలెక్టర్ డాక్టర్ మిరోనోజ్ సాహు, పర్యాటక శాఖ సంయుక్త డైరెక్టర్ అంజన్ కుమార్ బారిక్, ఖుర్దా పర్యాటక అభివృద్ధి అధికారి మీరా బెహరా, జిల్లా సాంస్కృతిక అధికారి చౌదరి అరవింద్ దాస్, జిల్లా క్రీడా అధికారి, పోలీసు, అగ్నిమాపక మరియు సహాయ మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతిధులు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న కుమారి శౌశ్య రెడ్డి, పోలీసు అధికారులు

జయపురం: వినాయక విగ్రహాల నిమజ్జనానికి తమ అనుమతి తీసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. స్థానిక మున్సిపల కార్యాలయ సమావేశం మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి, జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శౌశ్యా రెడ్డి మాట్లాడారు. గణేష్ మండపాల కమిటీలకు పలు సూచనలు చేశారు. ఎక్కువ శబ్దం ఉన్న మైక్‌లు వినియోగించకూడదని, విగ్రహాల నిమజ్జనానికి ముందుగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. అధికారులు ఇచ్చిన సమయాలలోనే ఊరేగింపు, విగ్రహాల నిమజ్జనం చేయాలని వెల్లడించారు. వినాయక మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రసాదం పంపిణీ సమయంలో పరిశుభ్రత పాటించాలని కుమారి శౌశ్యా రెడ్డి ఆదేశించారు. పారిశుద్ధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మండప పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిష్‌కు బదులు మట్టి విగ్రహాలనే వినియోగించాలన్నారు. సమావేశంలో ట్రాఫిక్, పట్టణ పరిశుభ్రతపై చర్చించారు. సమావేశంలో పట్టణ పోలీసు అధికారి ఉల్లాస రౌత్, జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్రప్రధాన్, 20 పూజా మండప కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో గంజాయి స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి



తనిఖీల్లో కస్టమ్స్ అధికారులకు చిక్కిన అక్రమ గంజాయి ప్యాకెట్లు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గంజాయి అక్రమ రవాణా గుట్టు రట్టయ్యింది. అధికారుల తనిఖీలో అత్యంత విలువైన గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. బ్యాంకాక్ నుంచి భువనేశ్వర్‌కు వచ్చిన ప్రేమ జంట ఈ గంజాయి రవాణా చేసినట్లు ధ్రువీకరించారు. గంజాయి స్వాధీనం చేసుకున్న విమానాశ్రయం కస్టమ్స్ విభాగం అధికారులు నిందిత ప్రేమ జంటను అదుపులోకి తీసుకుని ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 4 కోట్లు ఉంటుందని అంచనా.

ఎలుగుబంటి దాడి

- వృద్ధుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన పురుషోత్తమ అమనాత్య

జయపురం: పొలానికి వెళ్లిన వృద్ధుడిపై ఎలుగుబంటి దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం ఉదయం జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బిసింగపూర్ పంచాయతీ పొర్లియాగుడ గ్రామంలో చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి పొర్లియాగుడ గ్రామానికి చెందిన పురుషోత్తమ అమనాత్య (67)గా గుర్తించారు. ఎలుగుబంటి దాడిలో అమనాత్య ముఖంపై తీవ్ర గాయమైంది. అతడితో వచ్చిన రైతు రక్షించి బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఉదయం ఐదు గంటల సమయంలో అమనాత్య మరో రైతుతో కలిసి పొలానికి వెళ్లారు. తరువాత బహిర్భూమి కోసం సమీపంలో ఉన్న అడవికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని తిరిగి పొలానికి వస్తున్న సమయంలో కొంతదూరంలో తల్లి ఎలుగు బంటితో పాటు మూడు పిల్లలు కనిపించాయి. ఎలుగు బంట్లను చూసిన అమనాత్య అక్కడ నుంచి త్వరగా వెళ్లిపోవాలని పరుగుతీస్తుండగా.. కాలుజారి కింద పడిపోయాడు. అతడిని చూసిన ఎలుగుబంట్లు అతడిపై దాడి జరిపాయి. ముఖంతోపాటు ఇతర శరీర భాగాలపై తీవ్రంగా గాయపరచాయి. అతడు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రైతు అక్కడకు చేరుకొని కర్రతో కొట్టడంతో ఎలుగుబంట్లు అక్కడ నుంచి పారిపోయాయి. వెంటనే అమనాత్యను బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.

మానవీయత చూపించండి : గవర్నర్



ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: గిరిజన సంక్షేమ పథకాల అమలు నేపథ్యంలో అధికారులు మానవీయత చూపించాలని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి తెలిపారు. రాజ్ భవన్ నూతన అభిషేక్ హాల్‌లో షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, మైనారిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పు శాఖ, పంచాయితీ రాజ్, తాగునీటి శాఖల కార్యాచరణ ఉన్నత స్థాయి సమీక్షంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి రాష్ట్ర షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, బలహీన, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద్ గోండ్, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పు విభాగం మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా, ఆయా శాఖల సీనియర్ అధికారులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల అటవీ శాఖ అధికారులు, జిల్లా మండలి ముఖ్య అభివృద్ధి అధికారులు తదితరులు హాజరయ్యారు.

గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న పథకాలపై బుక్‌లెట్‌లను సిద్ధం చేసి సంబంధిత శాఖలు లబ్ధిదారుల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు. వివిధ సామాజిక భద్రతా పథకాలలో బ్యాంకు అధికారులకు ప్రధాన బాధ్యతని గవర్నర్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులకు అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, ఏకలవ్య ఆదర్శ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు వంటి పథకాల అమలులో తలెత్తే సమస్యలను గవర్నర్ సమీక్షించారు. అటవీ హక్కుల చట్టం కింద వివిధ జిల్లాల పురోగతిని సమీక్ష పురస్కరించుకుని పెండింగ్‌లో ఉన్న అభ్యర్థనలపై రానున్న 90 రోజుల్లోగా నిర్ణయం ప్రకటించాలని ఆదేశించారు. ఆందోళన కలిగిస్తున్న నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల సంబంధిత కేసుల పట్ల తనిఖీ చర్యల్ని వివరంగా తెలుసుకున్నారు. లఘు అటవీ ఉత్పత్తుల కొనుగోలు, వేలం ప్రక్రియలో గిరిజనులకు న్యాయమైన ధర లభించేలా చేయడంలో మధ్యవర్తులను తొలగించడం అనివార్యంగా పేర్కొన్నారు. లఘు అటవీ పదార్థాల ఉత్పాదన కోసం ఎంఎస్ఎమ్ఈలను ఏర్పాటు చేయడానికి వ్యవస్థాపకులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలతో ప్రతి గ్రామానికి మొబైల్ నెట్‌వర్క్‌ను అందించడంపై దృష్టి సారించాలని తెలిపారు. సౌర విద్యుత్ శక్తి వినియోగం పట్ల గిరిజనుల్ని చైతన్యపరచాలి. సీఎస్ఆర్ కార్యక్రమాలకు మద్దతుగా పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేయడంపై కూడా గవర్నర్ దృష్టి సారించారు.



ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి హాజరైన ప్రభుత్వ ఉన్నతాధికారులు

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 నగదును విశాఖపట్నానికి చెందిన కొల్లి తిరునాథరెడ్డి, ఝాన్సీ రాణి దంపతులు శనివారం సమర్పించారు. తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లు దాతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, సూపరింటెండెంట్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సముద్రపు నాచు పెంపకంపై అవగాహన



సముద్రపు నాచు పెంచే చెరువులను పరిశీలిస్తున్న కలెక్టర్

సోంపేట: సముద్రపు నాచు పెంపకంపై మహిళలు అవగాహన పెంచుకుని అదనపు ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోంపేట మండలం గొల్లూరు పంచాయతీ మూల పొలం గ్రామంలో జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు, ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో సాగు చేస్తున్న సముద్రపు నాచు పెంపకం చెరువులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక మత్స్యకార మహిళలతో సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా మాట్లాడారు. నాచు పెంపకం వల్ల కలిగే ఆదాయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత



ఇరపాడులో వంగ తోటను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు: జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి వరప్రసాదరావు తెలిపారు. కొత్తూరు మండలం ఇరపాడులో గొర్లె గౌరినాయుడుకు చెందిన ప్యాక్ హౌస్‌ను ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ శ్రీనివాసరావులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాక్ హౌస్‌లకు ప్రభుత్వం రూ.రెండు లక్షలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది 18 హౌస్‌లు నిర్మించగా, ఈ ఏడాది 22 నిర్మించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి బి.అయింతి పాల్గొన్నారు.

డీఈఓను తక్షణమే నియమించాలి

శ్రీకాకుళం: జిల్లా విద్యాశాఖ అధికారిని తక్షణమే నియమించాలని డీటీఎఫ్ నాయకులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు శనివారం డిమాండ్ చేశారు. 25 రోజులుగా రెగ్యులర్ డీఈఓను గానీ, పూర్తి అదనపు బాధ్యతలతో డీఈఓను నియమించకపోవడం విచారకరమన్నారు. విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోవడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆగస్టులో ఇంక్రిమెంట్లకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు లేకపోవడంతో పాత జీతంతోనే బిల్లులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వీసాలు, పాస్‌పోర్టులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం కొందరు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారని, అవి కూడా పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి బహిరంగ క్షమాపణ చెప్పాలి



నిరసన తెలియజేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

శ్రీకాకుళం అర్బన్: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బహిరంగ క్షమాపణ చెప్పాలని జిల్లా ఎన్టీఆర్ అభిమానులు డిమాండ్ చేశారు. శనివారం శ్రీకాకుళంలోని సరస్వతీ థియేటర్ ఆవరణలో జిల్లా ఎన్టీఆర్ అభిమానులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్, శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు దుంగ శ్రీధర్, శ్రీకాకుళం నగర ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు బుర్రి మధు మాట్లాడుతూ నందమూరి కుటుంబ సభ్యురాలైన నందమూరి షాలిని, జూనియర్ ఎన్టీఆర్‌లను దుర్భాషలాడినందుకు ఎమ్మెల్యేను తక్షణమే టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.



ల్యాంప్స్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఎరువుల కోసం రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న బీడీఓ బెహర



మథిలి ల్యాంప్స్ కార్యాలయం



ల్యాంప్స్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళా రైతులు

మల్కనగిరి: జిల్లాలోని మథిలి సమితిలో ఎరువుల కొరత తీవ్రంగా ఉండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ల్యాంప్స్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. సమితిలో సుమారు పదివేల ప్యాకెట్లు అవసరముండగా ఇప్పటికి కేవలం 4,600 ప్యాకెట్లు మాత్రమే వచ్చాయని ల్యాంప్స్ వర్గాలు తెలియజేశాయి. వరి సాగులో ఎరువుల అవసరం కారణంగా సకాలంలో లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎరువుల కోసం రైతుల కాళ్లు అరిగేలా ల్యాంప్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేక వెనుదిరిగిన సంఘటనలు చోటు చేసుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి వాహన రాకపోకలను నిలిపివేశారు. మల్కనగిరి- జయపూర్ రహదారి వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న బీడీఓ ప్రమెదు కుమార్ బెహర, తహసీల్దార్ మానసీ భోయ్, తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను బుజ్జగించే ప్రయత్నం చేశారు.

జెట్నీ జన సందోహ ప్రాంతంలో దాడి



బాధితునికి ఆస్పత్రి తరలింపు



మో జట్నీ కూడలి ప్రాంతంలో మారణాంతక దాడి సీసీటీవీ ఫుటేజ్

భువనేశ్వర్: జెట్నీ జన సందోహ ప్రాంతంలో శనివారం మారణాంతక దాడి జరిగింది. ఉదయం 10.30 గంటల సమయంలో మో జట్నీ కూడలి నడి రోడ్డు మీద తరుముతూ ఇనప కడ్డీతో మారణాంతక దాడికి పాల్పడిన సంఘటన గగుర్పొడిచింది. ఈ దాడిలో జెట్నీ ఠాణా బచ్చరాపట్నలో ఉంటున్న చందన్ నాయక్ (33) తీవ్రంగా గాయపడ్డాడు. అతడి మెడ, వీపు భాగాలు బలంగా గాయపడ్డాయి. సత్వర చికిత్స కోసం స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమిస్తుండడంతో ఉన్నత చికిత్స కోసం భువనేశ్వర్ ఎయిమ్స్‌కు తరలించారు. దాడిలో గంజాం జిల్లా, రంభా పోలీసు ఠాణా నౌగావ్ రొంగొమటియాకు చెందిన సుశాంత నాయక్ (38)ని నిందితుడిగా గుర్తించారు. జట్నీ ఠాణా పోలీసులు నిందితుని అరెస్టు చేసి దాడికి వినియోగించిన ఇనప కడ్డీని స్వాధీనపరచుకున్నారు. నిందితుని భార్యతో బాధితుడు కలిసి నివసిస్తున్న పరిస్థితిని తాళలేక ప్రతీకారంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడు మృతి



ఘటనా స్థలంలో మృతదేహం

కంచిలి: మకరాంపురం సమీపంలోని 'ఆదివారం సంత' కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పులకపుట్టుగ గ్రామానికి చెందిన పులక సన్‌రాజు(24) మృతిచెందాడు. బైక్‌పై స్వగ్రామం నుంచి జాతీయ రహదారి మీదుగా జాడుపూడి వైపు వెళుతుండగా.. బరంపురం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న శివదేవి ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సన్‌రాజు కేరళలో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండేవాడు. మూడు రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు. తండ్రి వాసులు వ్యవసాయం చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. తండ్రి ఫిర్యాదు మేరకు కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుని బ్యాగు అప్పగింత



బ్యాగును అప్పగిస్తున్న మునిగుడ ఆర్పీఎఫ్ పోలీసులు

రాయగడ: మునిగుడ ఆర్పీఎఫ్ అధికారి ఎస్.ఎస్.మీన, ఎస్ఐ సి.హెచ్.బి.రావు ఒక ప్రయాణికుని బ్యాగును తిరిగి అతనికి అప్పగించారు. గురువారం టాటానగర్ ఎక్స్‌ప్రెస్ బి–4 బోగీలో ప్రయాణిస్తున్న కె.లోకేష్ బ్రహ్మ అనే ప్రయాణికుడు కేరళ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశాఖ జిల్లా దువ్వాడ వరకు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వే స్టేషన్ వచ్చేసరికి హడావిడిగా దిగిపోయారు. ట్రాలీ బ్యాగ్‌ను మరిచిపోయారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం స్పందించిన రైల్వే పోలీసులు మునిగుడ ఆర్పీఎఫ్ వారికి సమాచారం అందించారు. మునిగుడకు ఎక్స్‌ప్రెస్ చేరుకునే సరికి బి–4 బోగీలో వెతికి ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బ్యాగును ప్రయాణికునికి పిలిచి అప్పగించారు.

• సెల్‌ఫోన్ల అందజేత



మాట్లాడుతున్న ఏఎస్పీ అంబో మహంతి



ఆదివాసీ మహిళకు ఫోన్ అందజేస్తున్న ఏఎస్పీ అంబో మహంతి



మహిళా న్యాయవాదికి ఫోన్ అందజేస్తున్న పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లు

జయపురం: జయపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోరీకి గురైన, పారేసుకున్న ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 17 ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వీటిని సంబంధిత వ్యక్తులకు శనివారం అందజేశారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొరాపుట్ ఏఎస్పీ అంబో మహంతి మాట్లాడుతూ తమ మొబైల్ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదు చేసిన వారిని రప్పించి వారి ఫోన్లను అందజేసినట్లు వెల్లడించారు. మొబైల్ ఫోనులు పోగొట్టుకున్న వారి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి వివిధ ప్రాంతాలలో దర్యాప్తులు జరిపి.. దాడులు నిర్వహించి 17 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్ పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రకాశ్ పట్నాయక్

జయపురం: జయపురం పీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ద్వితీయ జాతీయ మహాకాశ(అంతరిక్ష దినోత్సవం) నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాశ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయిరాలు పపిత ప్రధాన్ మంగళ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఈ రోజు చంద్రయాన్–3 మిషన్ విక్రమ్ విజయవంతంగా చంద్రునిపై కాలుపెట్టిన నాల్గో దేశంగా, దక్షిణ ధృవాన్ని చేరుకున్న ప్రథమ దేశంగా మన దేశం నిలిచిందని వెల్లడించారు. ఉపాధ్యాయిరాలు ఆధ్యాశక్తి పండా మాట్లాడుతూ చంద్రయానాన్ని వివరించారు. ఉపాధ్యాయులు దేవేంద్ర పాడీ, దీపక్ సాహు, తన్వీర్ మహమ్మద్, సౌమ్యరంజన్ పట్నాయక్, హరిహర చరిత, నిర్మలా టండిక, ప్రభాతీ పాణిగ్రాహి, కె.ప్రమీల, పి.రాజేశ్వరి, రశ్మిత నాయక్. రశ్మీ ప్రభ భంజ్, బనిత శతపతి, తదితరులు విద్యార్థుల క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

సుధాకర్‌రెడ్డికి ఘన నివాళులు



సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: భారతీయ కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ, కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ఉద్యమానికి, పీడిత ప్రజలకు తీరని లోటని కమ్యూనిస్టు పార్టీ నేతలు అన్నారు. జయపురం కార్మిక కర్మచారి భవనంలో జిల్లా కమ్యూనిస్టు పార్టీ శనివారం సంతాప సభ నిర్వహించింది. పార్టీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ దాస్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడారు. సురవం 2012 నుంచి 2019 వరకు పార్లమెంట్ సభ్యునిగా, జాతీయ కమ్యూనిస్టు పార్టీ సాధారణ కార్యదర్శిగా దేశ ప్రజలకు, పార్టీకి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంతాప సభలో కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ మాజీ కార్యదర్శి జుధిష్టర రౌళో, కార్మిక నేత బసంత బెహరా, భవన్ కుమార్, బొయిపరిగుడ జోనల్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి బలభద్ర బోయి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేతగా విజయనగరం



విజయనగరం సర్కిల్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న డైరెక్టర్ చంద్రం తదితరులు

అరసవల్లి: జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిశాయి. తుది ఫలితాల్లో ఓవరాల్ చాంప్‌గా విజయనగరం సర్కిల్ ఈపీడీసీఎల్ జట్టు నిలిచింది. రెండో స్థానంలో నెల్లూరు ఎస్పీడీసీఎల్, మూడో స్థానంలో జెన్‌కో ఆర్టీపీఎస్ కృష్ణపట్నం నిలిచాయి. శనివారం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టి.వనజ, చీఫ్ జనరల్ మేనేజర్ (ఆర్ఎ) ఎల్.మహేంద్రనాథ్, సీజీఎం (మెటీరియల్స్) పి.శ్రీదేవి, జనరల్ మేనేజర్ కె.సురేఖ తదతరులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ వడివేలు, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ, డివిజనల్ ఈఈ పైడి యోగేశ్వరరావు, సెక్రటరీ మహంతి ప్రభాకరరావు, సనపల వెంకటరావు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, ఎస్ఏఓ ఎ.శ్రీనివాసరావు, డీ–1 ఏఈ జె.సురేష్‌కుమార్, డీ–2 ఏఈ కింజరాపు జయరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి సై!



కొత్తూరు మండలం లబ్బ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న వరి పంట

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ
- భూసారం పెరుగుదలకు దోహదం

కొత్తూరు:

ప్రకృతి విధానంలో వ్యవసాయం చేసే రైతుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సహజంగా లభించే ఆవు పేడ, కషాయాలను పంట సాగుకు వినియోగిస్తూ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటికి మార్కెట్‌లో ఆదరణ బాగుండటంతో ప్రకృతి సేద్యం చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందించడంతో పాటు భూసారం పెంచేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదం చేస్తున్నందున ప్రభుత్వాలు సైతం ప్రోత్సాహం అందిస్తున్నారు. జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 77 వేలు మంది రైతులు సుమారు లక్ష ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు.

విస్తృత అవగాహన..

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తరచూ గ్రామాలకు వెళ్లి రైతులతో సమావేశమవుతున్నారు. ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. రసాయిన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల భూమికి, రైతులకు కలుగుతున్న నష్టాలను తెలియజేస్తున్నారు. అధిక ధరలు పలికే రసాయన ఎరువులకు బదులు తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, మీనామృతం వంటి కషాయాలపై అవగాహన కల్పిస్తున్నారు. వరి నాట్లు వేసే సమయంలో కాలిబాటలు వదలడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. భూమి మరింత సారవంతంగా మారేందుకు పీఎండీఎస్ కిటు (నవ ధాన్యాలు కిట్లు) సైతం రైతులకు పంపిణీ చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గత ఖరీఫ్ కంటే ఈ ఏడాది అన్ని రకాల పంటలు కలిపి సుమారు 40 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

పంట	రైతులు	విస్తీర్ణం
వరి	59 వేల మంది	63,000 ఎకరాలు
మొక్కజొన్న	5 వేల మంది	6,300 ఎకరాలు
ఉద్యానవన పంటలు	12 వేలు	9,000 ఎకరాలు
ఇతర పంటలు	1000	21,701 ఎకరాలు

ప్రకృతి వ్యవసాయం సాగు పెంచేందుకు చర్యలు..

ప్రకృతి వ్యవసాయం సాగు పెంచేందుకు పలు రకాలుగా చర్యలు చేపడుతున్నాము. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు పీడీఎం కిట్లు తక్కువ దరలకు ఇవ్వడం జరిగింది. పలు రకాల కషాయాలు తయారు పై శిక్షణను రైతులకు ఇస్తున్నాము. సాగు విస్తీర్ణం పెంచేందుకు పొలం బడిలో కూడా రైతులకు ప్రకృతి వ్యవసాయం పద్ధతులు పై అవగాహన కల్పిస్తున్నాము.



సోమరాజపురంలో జీవామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

బహుళ ప్రయోజనాలు..

- ప్రస్తుత సమాజంలో ఆరోగ్య స్పృహ పెరగడంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పంట ఉత్పత్తులు లభిస్తుండటంతో కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయి.
- దేశీయ ఆవుపేడతో జీవామృతం సొంతంగా తయారు చేసుకోవచ్చు. బీజామృతం, వేప కషాయాలు, మీన కషాయాల తయారీకి ఖర్చు తక్కువే.
- రసాయన ఎరువులు బదులుగా పేడ, కుళ్లిన గత్తం వంటివి వాడితే భూమి సారం పెరుగుతుంది. వాన పాములు, ఇతర సూక్ష్మజీవులు పెరిగి జీవ వైవిధ్యం కాపాడతాయి.
- రసాయన ఎరువులు వాడకపోవడం వల్ల ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు లభిస్తాయి. పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. కూరగాయలు, పండ్లు రుచిగా ఉంటాయి.
- వాతావరణంలో కాలుష్యం బాగా తగ్గుతుంది. భూమి సారవంతంగా మారుతుంది.
- పర్యావరణ సమతుల్యతకు మేలు చేసే పక్షులు, పురుగులు, ఇతర జీవరాశులను సంరక్షించవచ్చు.

తక్కువ ఖర్చుతో సాగు..



ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వరి పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకపోవడంతో ఖర్చు తగ్గింది. జీవామృతంతో పాటు ఇతర కషాయాలు పిచికారీ చేయడంతో ఆరోగ్యకరమైన పంట పండింది.

– అంపిలి బుచ్చిబాబు, ప్రకృతి వ్యవసాయ రైతు, గూనబద్ర, కొత్తూరు మండలం

పంట గిట్టుబాటు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేయడం వల్ల పంట గిట్టుబాటుగా ఉంటోంది. పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. దిగుబడులు సైతం ఆశాజనకంగా ఉంటున్నాయి. భూమి సారవంతంగా మారుతుంది.

– ఎస్.అప్పారావు, ప్రకృతి వ్యవసాయ రైతు, లబ్బ గ్రామం, కొత్తూరు మండలం

క్లుప్తంగా

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ



నర్సిపురంలో స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

పార్వతీపురం రూరల్: ప్రతీ ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సిపురం గ్రామంలో స్థానికులతో కలసి శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉండదని ఆమె తెలిపారు. బాధ్యతగా గ్రామాల్లో ఉన్న చెత్త సేకరణ సిబ్బందికి స్పందిస్తూ నిబంధనల మేరకు తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా అందించి ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా చెత్త సేకరణ సిబ్బందికి అప్పగించాలన్నారు. పార్వతీపురం తహసీల్దార్ సురేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల తస్మాత్.. : ఎస్పీ

సీతానగరం: సైబర్ నేరాలకు పాల్పడవద్దని, మాదక ద్రవ్యాల బారిన పడి యువకులు తప్పుదోవ పట్టొద్దని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు. మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ క్రీడా మైదానంలో సంకల్పం ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, మాదక ద్రవ్యాల నిరోధం అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను నిజం చేసే విధంగా విద్యావంతులు కావాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు ఎస్పీ అంకిత సురానా, డీవీఈవో నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజారావు, ఎంఈవోలు సూరిదేములు, వెంకటరమణ, సీఐ గోవిందరావు, ఎస్ఐ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వంశధారలో వివాహిత గల్లంతు



గల్లంతైన వివాహిత కుమ్మరి లక్ష్మి(ఫైల్)

భామిని: మండలంలోని లివిరి గ్రామానికి చెందిన వివాహిత కుమ్మరి లక్ష్మి(38) గ్రామ సమీపాన ఉన్న వంశధార నదిలో శనివారం స్నానానికి దిగి గల్లంతైంది. దీన్ని గుర్తించిన నదిలోని తోటి మహిళలు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ శివన్నారాయణ, ఎంఆర్ఐ మణి ప్రభాకర్, బత్తిలి ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో కొత్తూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి తెప్పల సాయంతో నదిలో గాలించారు. అయినా లక్ష్మి జాడ కనిపించలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నదీ తీరాన ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ

బొబ్బిలి: రాష్ట్రంలో కొత్తగా వితంతువులు, వృద్ధులు, నిరుపేద వర్గాలవారికి ఒక్క పింఛన్ మంజూరు చేయకుండా, గత ప్రభుత్వం మంజూరు చేసిన దివ్యాంగుల పింఛన్ల తొలగింపుకు కూటమి ప్రభుత్వం పూనుకోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, కోతలే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఏడాది పాలనలో 4లక్షల పింఛన్లను నిలిపేయగా, జిల్లాలో 80వేల పింఛన్లు తొలగించిన ఘనత కూటమిదేనన్నారు. దివ్యాంగులు దేవుడు బిడ్డలని, వారికి అండగా ఉండి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కక్షసాధిస్తోందన్నారు. దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని స్పష్టంచేశారు. యూరియా కోసం రైతులు నానా పాట్లు పడాల్సి వస్తోందన్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడమే ఎరువు కష్టాలకు ప్రధాన కారణమన్నారు.

నిరుద్యోగ భృతి ఏదీ?

ఎన్నికల ముందు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న కూటమి నాయకులు ఇప్పుడు ఏం మాట్లాడడం లేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. 16 నెలల్లో ఎంతమందికి నిరుద్యోగ భృతి చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉచితమంటూ ఐదు సర్వీసులా?

మహిళల కోసం రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణం అంటూ చెప్పారని, ఇప్పుడు కేవలం 5 సర్వీసులతోనే బస్సులు నడుపుతున్నారని, దీంతో మహిళంతా అదే బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణాలు చేయాల్సి వస్తోందన్నారు. ఉచిత బస్సు ఓ బూటమన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలో లక్షా 70వేల కోట్ల అప్పుచేసిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పక్కనపెట్టేసిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు శంకిలి శాంతకుమారి, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీ కృష్ణ, తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అవి రక్త పరీక్ష (వసూళ్ల) కేంద్రాలు!

- జిల్లాలో 47 రక్త పరీక్ష కేంద్రాలు
- మలేరియా, టైఫాయిడ్, డెంగీ స్పెషల్ ప్యాకేజీలంటూ వసూళ్లు
- ప్యాకేజీ కింద రూ.2 వేల నుంచి 2500 వరకు వసూళ్లు

జిల్లాలో ల్యాబ్‌ల వివరాలు	
ప్రైవేటు ల్యాబ్‌లు :	14
ప్రైవేటు ఆసుపత్రుల్లో ల్యాబ్‌లు :	34
పాలీక్లినిక్‌లలో ల్యాబ్‌లు :	35



పట్టణంలో ప్రైవేట్ ల్యాబ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.జగన్మోహన్‌రావు (ఫైల్)

పార్వతీపురం టౌన్: పల్లె, పట్టణం అన్న తేడా లేదు.. మంచం పట్టని గ్రామం అంతకన్నా లేదు.. వీధివీధినా.. ఇంటింటిలో జ్వరంతో ప్రజలు అల్లాడుతున్నారు. జ్వర బాధితులను కాళ్లు వాపులు, ఒళ్లు నొప్పులు వేధిస్తున్నాయి. వచ్చింది ఏ జ్వరమో తెలుసుకునేందుకు రక్త పరీక్ష కేంద్రాలకు వెళ్తే మలేరియా, టైఫాయిడ్, డెంగీ ప్యాకేజీ అంటూ రూ.2వేల నుంచి రూ.2500 వరకూ కేంద్రాల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు.

నెల రోజులుగా..

నెల రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు ఒక్కొక్క పరీక్షకు ఒక్కో రేటు అన్న చందంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఏ పరీక్షకు ఎంత ధర అన్న వివరాలు తెలిపే బోర్డులు ఏవీ ఏర్పాటు చేయడం లేదు. జ్వర పీడితులు అధికంగా ఉండటంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలకు ప్రత్యేక ప్యాకేజీ అంటూ వేల రూపాయిలు వసూలు చేస్తున్నారు. జ్వర పీడితులను తమ వద్దకు పంపించిన ప్రైవేటు వైద్యులు, ఆర్‌ఎంపీలకు రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు కమీషన్లు ముట్టజెబుతున్నారు. సీజనల్ వ్యాధుల ముసుగులో రక్త పరీక్ష కేంద్రాల వారు బాగా దండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌సీల్లో అంతంతమాత్రంగానే...

జిల్లాలోని 37 పీహెచ్‌సీలతో పాటు ఐదు పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. గతంలో ఆసుపత్రుల్లో నిత్యం ఓపీకి 20 నుంచి 30 వరకు వచ్చేవారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది పెరగడమే కాకుండా, అవసరమైన మందులు, రక్త పరీక్షలకు యంత్ర పరికరాలు సమకూరాయి. వైద్య సేవలు మెరుగు కావడంతో రోజుకు వంద మంది ఓపీ సేవలు అందించేవారు. రక్త పరీక్షల సామగ్రి పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో గతంలో పరీక్షలు వేగవంతంగా చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పీహెచ్‌సీల అభివృద్ధి గాలికి వదిలేయడంతో పీహెచ్‌సీల్లో సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయన్న విమర్శలున్నాయి.

డిస్‌ప్లే బోర్డులు తప్పనిసరి

రక్త పరీక్ష కేంద్రాల్లో ధరలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలి. అధిక ధరలు వసూలు చేస్తున్న ల్యాబ్‌లను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ల్యాబ్‌లలో మాత్రమే రక్త పరీక్షలు చేయించుకోవడం మంచిది. అన్ని పీహెచ్‌సీలలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రజలు గమనించాలి.

– డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి

చర్యలు తీసుకుంటాం..



రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అధిక ధరలు వసూలు చేస్తున్న వారి వివరాలు తెలిపితే అక్కడకు వెళ్లి విచారణ చేస్తాం. ల్యాబ్‌ల్లో తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. ఎక్కడ అధికంగా వసూలు చేసినా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ భాస్కరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో, పార్వతీపురం

త్వరలో అన్ని పోలీస్‌స్టేషన్లకు డ్రోన్లు : డీఐజీ



వార్షిక తనిఖీల్లో భాగంగా టూ టౌన్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్‌ను కేసుల పనితీరుపై తెలుసుకుంటున్న డీఐజీ గోపినాథ్ జెట్టి, ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : త్వరలో అన్ని పోలీసుస్టేషన్లకు డ్రోన్లు పంపిణీ చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను విరివిగా ఉపయోగించాలని అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విజయనగరం టూటౌన్ పోలీసుస్టేషన్‌ను శనివారం సందర్శించారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. స్టేషన్లోని సీసీ టీవీ కమాండ్ కంట్రోల్ రూమును సందర్శించి వాటి పని తీరును చూశారు. స్టేషన్లో పని చేస్తున్న కోర్ట్ కానిస్టేబుళ్లతో మాట్లాడి శిక్షలు పడటానికి అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పర్చాలని, సమన్లు సకాలంలో సర్వ్ చేయాలని సూచించారు. అనంతరం స్టేషన్లోని రిసెప్షన్, గదులను పరిశీలించి, రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేసి, పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రతలపై సమీక్షించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి అదుపు చేయాలన్నారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంరక్షణలో పోలీసుల పాత్ర చాలా కీలకం అని, వారు శక్తి యాప్ గురించి క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి సమాచారిన్ని సేకరించి సంబంధిత అధికారులకు చేరవేయాలని ఎం.ఎస్.పి.లను డీఐజీ ఆదేశించారు. అనంతరం సీఐ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఇక ఎంఎస్పీలను బందోబస్తుకు ఉపయోగించబోమని, కేవలం స్టేషన్ వారీగా సమాచారం కొరకు వారి సేవలను వినియోగిస్తున్నామన్నారు. అనంతరం డీఐజీ జెట్టి, ఎస్పీ వకుల్ జిందల్ పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. వార్షిక తనిఖీల్లో డీఐజీతో పాటు డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ ఎ.వి.లీలారావు, టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు,ఎస్ఐలు కృష్ణమూర్తి, కనకరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ డాక్టర్ ఆత్మహత్య



మృతి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ నరసింహరావు

విజయనగరం క్రైమ్: పురుగుల మందు తాగి ఆర్‌ఎంపీ వైద్యుడు నరసింహరావు(48) ఆత్మహత్య చేసుకున్నట్టు వన్ టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. దీనికి సంబంధించి ఏఎస్ఐ జగన్మోహనరావు తెలిపిన వివరాలు.. భోగాపురంలో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్న నరసింహరావు రెండు రోజుల కిందట భార్య జ్యోతికి విజయనగరంలో పని ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. నరసింహరావు నగరంలోని సంగీత కళాశాల వద్ద ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద పడి ఉండడాన్ని శనివారం గుర్తించిన స్థానికులు ఫోన్ నంబరు ఆధారంగా భార్యకు సమాచారం అందించారు. వెంటనే భోగాపురం నుంచి వచ్చిన జ్యోతి అపస్మారక స్థితిలో ఉన్న భర్తను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్పించింది. కాగా, శనివారం మృతి చెందినట్టు ఆసుపత్రి వర్గాలు వన్ టౌన్ పోలీసులకు తెలియజేయడంతో కేసు నమోదు చేశారు.

కూటమి పాలనలో రైతన్నకు కష్టాలే...

విజయనగరం గంటస్తంభం:

చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా రైతులు ఎరువులు, విత్తనాల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకుంటుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర అన్నారు. విజయనగరం ప్రదీప్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఇంటి వద్ద విలేకరులతో శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల వద్ద స్టాక్ ఉంచి రైతులకు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి ప్రభుత్వం రైతును వంచించడం సబబు కాదన్నారు. విజయనగరం, సాలూరు నియోజవర్గంలో సుమారుగా 2,500 మంది పింఛన్‌దారులకు నోటీసు అందజేయడం విచారకరమన్నారు. నోటీసులు ఇచ్చామే తప్ప పింఛన్లు తొలగించమంటూ జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీలను త్రికరణ శుద్ధితో అమలుచేయడంలో సీఎం చంద్రబాబు చేతులెత్తేశారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 58,58,000 మందికి రైతు భరోసా అందజేస్తే.. నేడు సుమారు 78 లక్షల మంది రైతులు ఉండగా 50 లక్షల మందికే అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి కలిగిందన్నారు. తల్లికి వందనం పథకంలోనూ కోత పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా నిరుద్యోగభృతి ఊసేలేదన్నారు. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ఉత్త గ్యాస్‌గా మారిందని విమర్శించారు. ఆడబిడ్డ నిధికి సమాధి కట్టేశారని విమర్శించారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు మహిళందరికీ ఆడబిడ్డ నిధి కింద ప్రతీ నెలా రూ.1500 అందజేస్తామని చెప్పి ఉసూరుమనిపించారన్నారు.

అబద్ధాల పాలన

గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి మాటల్లో నూరుకి తొంభై అబద్ధాలే ఉంటాయని రాజన్నదొర విమర్శించారు. సాలూరు నియోజకవర్గంలోని గిరిశిఖర గ్రామాలకు చంద్రబాబు హయాంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. మక్కువ నుంచి మంత్రి స్వగ్రామం కవిరిపల్లికి, కవిరిపల్లి నుంచి శంబరకు, శంబర నుంచి మామిడిపల్లికి వెళ్లే రోడ్లు అధ్వానంగా మారినా మంత్రి స్పందించకపోవడం విచారకరమన్నారు. మక్కువ నుంచి భోగవలస మెయిన్ రోడ్డును రూ.56 కోట్లతో కొంతమేర పనులు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. మంత్రికి బురద జల్లడం తప్ప పనులు చేయడం చేతకావడంలేదని విమర్శించారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: చిన్నారులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం, ఆర్‌బీఎస్‌కేలో భాగంగా జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. విశాఖపట్టణం నుంచి వచ్చిన గుండె వైద్యనిపుణులు ఎ.అశోక్‌రాజు 18 ఏళ్ల లోపు బాలలు 26 మందికి గుండె పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఏడుగురిని మెరుగైన వైద్యసేవల కోసం ఎన్టీఆర్ వైద్యసేవ కింద మెడికవర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు టి. జగన్మోహన్‌రావు, రఘుకుమార్, పిల్లల వైద్యనిపుణులు భరత్ చంద్ర, ఎపిడిమాలజిస్ట్ కౌశిక్ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు సహకరించండి

పార్వతీపురం: ఓటరు జాబితా తయారీలో రాజకీయ పక్షాల ప్రతినిధులు, బీఎల్‌ఓలకు సహకరించాలని కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఎస్.చిన్నారావు కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్‌ఓ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు ఒక నియోజకవర్గంలోనే నమోదై ఉండాలన్నారు. ఓటరు వేరే ప్రాంతానికి బదిలీ అయితే, తన ఓటుహక్కును కూడా బదిలీ చేసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త ప్లాన్‌లు

విజయనగరం టౌన్: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త ట్రిపుల్ పే ప్లాన్‌ను ప్రకటించిందని ఆ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ. 400 చెల్లించడం ద్వారా హైస్పీడ్ ఇంటర్‌నెట్‌తో పాటూ 400పైగా టీవీ చానెల్స్, తొమ్మిది ఓటీటీ చానెల్స్, అపరిమిత ఫోన్‌కాల్స్ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఎఫ్‌టీటీహెచ్ వాడుతున్న వినియోగదారులు కూడా రూ.140 చెల్లించి టీవీ, ఓటీటీ చానల్స్ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువు కోసం గిరిజన రైతుల ఆందోళన



ఎరువు కోసం ఎదురు చూస్తున్న గిరిజన రైతులు

జియ్యమ్మవలస రూరల్: ఎరువు దొరకక గిరిజన రైతులు ఆందోళనకు దిగారు. అలమండ పంచాయతీలో నిడగల్లుగూడ, చినతోలుమండ, చినతోలుమండ గూడ, రామభద్రపురం, ఎస్సీ మరువాడ, ఎస్‌టీ మరువాడ, నీలకంఠాపురం తదితర తొమ్మిది గ్రామాలకు చెందిన 600 మంది రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడుతున్నా పట్టించుకునేవారే లేరని వాపోయారు. ప్రస్తుతం 222 బస్తాల యూరియా వచ్చిందని, ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున ఇచ్చినా మరో 400 బస్తాల ఎరువు అవసరమని, పూర్తిస్థాయిలో ఎప్పుడు సరఫరా చేస్తారని కూటమి సర్పంచ్ చంటి అధికారులను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రైతుపై చిన్నచూపు చేస్తోందని, విత్తనాలు, ఎరువులు అందించడంలో విఫలమైందంటూ రైతులు నగేష్, అన్నపూర్ణ తదితరులు ఆరోపించారు.

నిందితులను శిక్షించడంలో విజయనగరం టాప్



నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కలెక్టర్ అంబేడ్కర్, జిల్లా జడ్జి బబిత, ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, తదితరులు

- డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్: మహిళలపై దాడులు చేపడుతున్న వారితో పాటు పోక్సో కేసుల్లోని నిందితులను శిక్షించడంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. శనివారం స్థానిక డీపీఓ అర్థ సంవత్సరపు నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా జడ్జి బబిత హాజరైన ఈ సమీక్షలో డీఐజీ మాట్లాడుతూ..ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఎక్కువగా విద్యార్థులు అరెస్ట్ అవుతున్నారన్నారు. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి, డీ అడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందించాలని సూచించారు. నేరాల నియంత్రణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమాజానికి కీడు కలిగించే ప్రతీ అంశం తెలుసుకోవాల్సిన బాధ్యత పోలీస్ సిబ్బందిపై ఉందన్నారు. సైబర్ కేసులను దర్యాప్తు చేసేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని పోలీస్ అధికారులు మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అనుమతుల్లేకుండా కలిగి ఉన్న ఆయుధాలను స్వాధీన పరుచుకునేందుకు కార్డన్‌సెర్చ్ కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు.

పరిహారం మంజూరయ్యేలా చర్యలు..

కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం తక్షణమే మంజూరయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. జాతీయ రహదారిపై 66 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్ అందిస్తామన్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ.. గంజాయి నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ పది ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపడుతుండడంతో పాటు ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అడ్డుకుంటున్నామని తెలిపారు. 25 పోక్సో కేసుల్లోను, మరో 18 కేసుల్లో నిందితులు శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం శక్తి యాప్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌ను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆవిష్కరించారు. షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించిన అగ్గిరాజు, రూప, హారికలను అధికారులు అభినందించారు. అదేవిధంగా గంజాయి కేసుల్లో ఇన్వెస్టిగేషన్‌ను సమర్థవంతంగా పూర్తి చేసిన ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావులకు డీఐజీ గోపీనాథ్ జెట్టి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డి.మణికుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ బి.శ్రీనాథుడు, డీఎఫ్‌ఓ ఆర్. కొండలరావు, డీఎంహెచ్‌ఓ జీవన్రాణి, డీఈఓ కేవీ రమణ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజు, డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, జి. భవ్యారెడ్డి, డీఎస్పీ ఎస్.రాఘవులు, డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీఎస్పీ ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, జైళ్ల శాఖ, ఉమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, డ్రగ్స్ అండ్ కంట్రోల్ శాఖాధికారులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలి..

న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషన్ వేగవంతంగా పూర్తయ్యేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని జిల్లా జడ్జి బబిత కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కోరారు. ఎన్డీపీఎస్ కేసుల్లో ఇన్వెంటరీ, సీజర్ చేయడంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సెప్టెంబర్ 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పోలీస్ అధికారులను కోరారు.

‘ఉపాధి’ అవకతవకలపై విచారణ వాయిదా



వాదులాడుకుంటున్న ఇరువర్గాలు

లక్కవరపుకోట: మండలంలోని కోనమసివానిపాలెం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని గ్రామానికి చెందిన కాకర శ్రీనివాసరావు గత నెలలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధిహామీ పథకం అధికారులు విచారణ చేపట్టడానికి శనివారం గ్రామానికి రాగా.. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకుడు బండ అప్పారావు (అప్పన్న) మరో 39 మంది వ్యక్తులతో కలిసి ఉపాధి నిధులను దుర్వినియోగం చేసినట్లు కాకర శ్రీనివాసరావు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. 2011 సంవత్సరం నుంచి 2019 వరకు జరిగిన అవకతవకలపై సోషల్ ఆడిట్ బృందాలు సైతం సక్రమంగా ఆడిట్ నిర్వహించలేదని.. అలాగే 2024 వరకు పనికి వెళ్లని వారి పేరిట దొంగ మస్తర్లు వేసి నిధులు దోచుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో గజపతినగరం ఏపీడీ కె.రామామణి ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో గల పంచాయతీ కార్యాలయం వద్దకు శనివారం చేరుకుని విచారణకు సిద్ధపడగా గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. పనులకు సంబంధించి ఎటువంటి అవకతవకలు జరగలేదని ఒకవర్గం.. జరిగాయని మరోవర్గం ఆరోపిస్తూ వాదనకు దిగారు. దీంతో ఓ దశలో తోపులాట జరగడంతో అధికారులు భయంలో సమీపంలో గల రామాలయంలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించారు. అయితే పరిస్థితి అనుకూలంగా లేదని పోలీసులు చెప్పడంతో విచారణను వాయిదా వేస్తున్నట్లు ఏపీడీ రమామణి ప్రకటించి, వెళ్లిపోయారు. కార్యక్రమంలో డీబీటీ మేనేజర్ ఆసీఫ్ హుసేన్, స్థానిక ఏపీఓ విజయలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర మంత్రుల పేర్లు మిస్సింగ్



కింజరాపు అచ్చెన్నాయుడు



కొండపల్లి శ్రీనివాస్



గుమ్మడి సంధ్యారాణి

సాక్షి ప్రతినిధి,విజయనగరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు తాను ఒక కార్పొరేట్ కంపెనీ సీఈఓగా భావించుకుంటూ మంత్రులను సెకెండ్ క్యాడర్ ఉద్యోగులుగా చూస్తూ వారి పనితీరును మదింపు చేస్తూ ర్యాంకింగులు ఇవ్వడం చాన్నాళ్లుగా ఉన్న అలవాటు. ఇదే క్రమంలో ఈసారి కూడా మంత్రులకు ర్యాంకులు ఇచ్చారు. ఇందులో భాగంగా ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అత్యద్భుత పని తీరు కనబరచిన వారు అంటూ ఐదుగురు మంత్రులతో టాప్-5 జాబితా ప్రకటించారు. అందులో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన తర్వాత ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రెండో స్థానం, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నారు. నాలుగో స్థానంలో హోం మంత్రి అనిత, ఐదో స్థానంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చోటు దక్కించుకున్నారు. దాదాపు పాతికమంది మంత్రులు ఉన్న క్యాబినెట్లో కేవలం ఐదుగురికి మాత్రమే ర్యాంకుల కేటాయించిన సీఎం మిగతా వారిని పక్కనపెట్టినట్లుగా తెలుస్తోంది. పవన్‌కల్యాణ్ పేరు కూడా ఈ జాబితాలో కనిపించలేదు. ఆయనను పనితీరు విషయంలో పరిగణనలోకి తీసుకోలేదో, ఆయన ర్యాంకులకు అతీతం అనుకున్నారో కానీ పవన్ మాత్రం లిస్టులో లేరు. ఇక విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి ముగ్గురు మంత్రులు ఉన్నా వారెవరూ లిస్ట్‌లో లేరు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉండగా, గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ చిన్న, కుటీర పరిశ్రమలు, ప్రవాస భారతీయుల వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు వ్యవసాయమంత్రిగా కొనసాగుతున్నారు. గత ఫిబ్రవరిలో కూడా ర్యాంకులు ప్రకటించగా అందులో కొండపల్లి శ్రీనివాస్ మూడో స్థానంలో నిలిచారు. అసెంబ్లీకి తొలిసారి ఎన్నికై, ఏకంగా మంత్రి పదవి దక్కించుకున్న కొండపల్లి కొత్తవారైనా మంచి పనితీరుతో సీనియర్లను దాటుకుని మూడో స్థానంలో నిలిచారని అప్పట్లో చెప్పుకున్నారు. అప్పట్లో అచ్చెన్నాయుడు 17, సంధ్యారాణి 18 ర్యాంకుల్లో నిలిచారు. అయితే, ఇప్పుడు కేవలం ఐదు ర్యాంకులు మాత్రమే ప్రకటించడంలో ఈ మంత్రులు ఎవరికీ పాపం అందులో స్థానం దక్కలేదు.